ఆస్తిపన్ను లక్ష్యాన్ని అధిగమించాలి

ఆస్తిపన్ను వసూళ్ల విషయంలో బిల్‌కలెక్టర్లకు దిశానిర్దేశం చేస్తున్న డీసీ మారుతిదివాకర్

● డీసీ మారుతిదివాకర్

అంబర్‌పేట, డిసెంబర్ 14 : ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను వసూలు లక్ష్యాన్ని అధిగమించాలని అంబర్‌పేట సర్కిల్ డీసీ మారుతి దివాకర్ తన సిబ్బందికి సూచించారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో గురువారం బిల్ కలెక్టర్లతో డీసీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి ఆస్తి పన్ను వసూలుపై దిశానిర్దేశం చేశారు. ముందుగా ఆస్తి పన్ను బకాయిదారులపై ఫోకస్ పెట్టాలన్నారు. అవసరమైన వారికి నోటీసులు జారీ చేసి పన్ను వసూలు చేయాలని చెప్పారు. ఈ ఏడాది వసూలు లక్ష్యాన్ని చేరుకోవాలని, అందుకు సిబ్బంది అంతా సహకరించాలని ఆయన అన్నారు.

ఎపిక్ కార్డులు పంపిణీ చేయండి...

ఓటర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఎపిక్ కార్డులను మొత్తం ఓటర్లకు అందజేయాలని డీసీ మారుతి దివాకర్ బీఎల్‌వోలకు చెప్పారు. దీనిపై ఆయన గురువారం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో ఉన్న తప్పొప్పులను కూడా సరిచేయాలని తెలిపారు. చనిపోయిన వారి పేర్లు ఉన్నట్లైతే వాటిని గుర్తించి తొలగించాలని ఆయన అన్నారు.

17 నుంచి ధనుర్మాస పూజలు..

చిక్కడపల్లి, డిసెంబర్14 : ఆర్టీసీక్రాస్ రోడ్స్‌లో శ్రీలక్ష్మీ గణపతి దేవాలయంలో 17 నుంచి జనవరి 14వరకు ధనుర్మాస పూజలు నిర్వహిస్తామని దేవాలయం కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి తెలిపారు. 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయం 5.30 నుంచి ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామని చెప్పారు. ధనుర్మాస పూజలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ప్రేమ్‌నగర్ నాలా పనులు పూర్తి చేయాలి

అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్ నుంచి పటేల్‌నగర్ వరకు ఏర్పాటు చేస్తున్న నాలా పెండింగ్ పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ గురువారం పరిశీలించారు. వెంటనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన కోరారు. కార్పొరేటర్ వెంట అధికారులు డీఈ రఘు, ఏఈ విశ్వజిత్ తదితరులు ఉన్నారు. – గోల్నాక, డిసెంబర్ 14

తెలుగు సాహిత్య సేవకుడు సీపీ బ్రౌన్

త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా గురువారం తెలుగు సాహిత్య సేవకుడు సీపీ బ్రౌన్ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్త ముఖ్య అతిథిగా పాల్గొని బ్రౌన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జయసూర్య, బీకే అపర్ణ, టి.చక్రపాణి పాల్గొన్నారు. – ముషీరాబాద్, డిసెంబర్14

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

చిక్కడపల్లి, డిసెంబర్ 14 : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని చిక్కడపల్లి పోలీసులు స్వాధీనం చేసుకుని గాంధీ దవాఖానలో భద్ర పర్చారు. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మెట్రో స్టేషన్ సమీపంలో సుమారు 50 సంవత్సరాల వ్యక్తి అపస్మారక స్థితిలో పడిఉన్నాడని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని 108కు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. వారు వచ్చి పరిశీలించి అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. దీంతో మృతదేహాన్ని గాంధీ దవాఖాన మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. వివరాలకు చిక్కడపల్లి పోలీసులను సంప్రదించాలని చెప్పారు.

నర్సింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వినతి

మంత్రి రాజనర్సింహతో నిరుద్యోగ నర్స్‌లు

కవాడిగూడ, డిసెంబర్ 14: వైద్య, ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న నర్సింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని నిరుద్యోగ నర్సింగ్ ఆఫీసర్స్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతి పత్రాన్ని అందజేసినట్లు నిరుద్యోగ నర్సింగ్ ఆఫీసర్స్ గోవర్ధన్, వెంకటేశ్, యశ్వంత్, లక్ష్మణ్, అనిత, అర్చన నవీన తెలిపారు. ఆగస్టులో రాసిన 5,204 పోస్టులకు ఫైనాన్సియల్ అప్రూవల్ ఇచ్చిన 1,827 పోస్టులు కలిసి మొత్తంగా ఉన్న 7,031 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని దామోదర రాజనర్సింహను కోరినట్లు తెలిపారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

సీవరేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభించాలని వినతి

జలమండలి జీఎంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ ఉమాయాదవ్ తదితరులు

కాచిగూడ,డిసెంబర్ 14: డివిజన్‌లోని లాల్‌బహదూర్ స్కూల్ నుంచి చెప్పల్‌బజార్ వరకు మంజూరైన సీవరేజీ పైప్‌లైన్ పనులను జలమండలి అధికారులు ప్రారంభించకపోవడంతో ఆ ప్రాంతాల్లో నూతన సీసీ రోడ్డును వేయడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని కార్పొరేటర్ ఉమాయాదవ్ అన్నారు. ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం జలమండలి జీఎం రామకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, డీజీఎం సన్యాసిరావు, ఏఈ భావన, సుభాష్‌పటేల్, ఆర్. సంతోష్, భీంరాజ్, మల్లికార్జున్, రవియాదవ్, సూరి, రాము, బాలప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డికి సత్కారం..

శాసన సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డిని గురువారం బాగ్‌లింగంపల్లి పైడి రాకేశ్‌రెడ్డి ఫౌండేషన్ సిబ్బంది సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుచరితారెడ్డి, రేవతిరెడ్డి, డీఎస్ఎస్ గంగాధర్ గుప్త, శ్రేష్ఠి, సురేశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు. – ముషీరాబాద్, డిసెంబర్ 14

పుస్తకాల ఆవిష్కరణ

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సినీనటుడు సుబ్బరాయశర్మ తదితరులు

చిక్కడపల్లి, డిసెంబర్ 13: వీక్షణం సాహితీ వేదిక ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ కవయిత్రి, కార్య నిర్వాహక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ కె. గీత రచించిన ఆంగ్ల పుస్తకం 'సెంటినరీ మూన్ లైట్, ఇతర కవితలు, ఎట్‌ది హార్ట్ ఆఫ్ సిలికాన్ అనే రెండు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటుడు సుబ్బరాయశర్మ, ఆత్రేయశర్మ హాజరై పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వీక్షణం ప్రతినిధి గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు, సాహితీవేత్తలు వసీనా, ఎలనాగ, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు శుభాకాంక్షలు ..

తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన గడ్డం ప్రసాద్ కుమార్‌ను తెలంగాణ జూనియర్ కాలేజెస్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.లక్ష్మయ్య, మహేశ్‌కుమార్ గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. – అంబర్‌పేట, డిసెంబర్ 14

ప్రేమ్‌నగర్‌లో అయ్యప్ప మహాపడిపూజ..

అంబర్ పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో అయ్యప్ప మహాపడి పూజా కార్యక్రమం నిర్వహించారు. గురువారం డి. గంగరాజు వంజరి గురుస్వామి ఆధ్వర్యంలో 21వ మహా పడి పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వాములకు భిక్షను వడ్డించారు. – గోల్నాక, డిసెంబర్ 14

యువతి అదృశ్యం

సుచరిత

చిక్కడపల్లి, డిసెంబర్ 13 : రేషన్ బియ్యం తెస్తానని ఊరికి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లాకు చెందిన ఈట రాజప్ప 20 సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి అజామాబాద్‌లో కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రాజప్ప పెద్ద కుమార్తె సుచరిత (26) నెల రోజుల నుంచి రాంగనర్‌లోని ఓ షాపులో పనిచేస్తున్నది. కాగా ఈ నెల 11వ తేదీన సుచరిత ఊరి నుంచి రేషన్ బియ్యం తెస్తానని వెళ్లింది. సాయంత్రం రాజప్ప ఊరిలో ఉండే తన తమ్ముడికి ఫోన్ చెయ్యగా సుచరిత రాలేదని తెలిపాడు. దీంతో కలత చెందిన తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును ఎస్సై కోటేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నాడు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నం. 8712661246కు సమాచారం అందించాలని తెలిపారు.

హుండీ లెక్కింపు..

హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఈఓ దేవనాదం తదితరులు

చిక్కడపల్లి, డిసెంబర్14 : చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం హుండీ లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాదం మాట్లాడుతూ..40 రోజులకు గాను రూ.1,54,696 ఆదాయం వచ్చిందని వివరించారు. దేవాలయం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పండుగలకు అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు అన్ని ఏర్పాటు చేయడం జరగుతుందని తెలిపారు. దేవాదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ్ పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు డాక్టర్‌టి.రామకృష్ణ, జీకే రమణ, మురికి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు స్థలం ఇస్తామనడంపై హర్షం

అంబర్‌పేట, డిసెంబర్ 14: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ప్రకటించినట్లుగా 250 గజాల స్థలం ఇవ్వడానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామని చెప్పడంపై తెలంగాణ ఉద్యమకారుల కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బండి రమేశ్, ఉప్పు సుధాకర్ గన్‌పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు.